క్లుప్తంగా

రహదారి వెంబడి చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

ముప్పాళ్ళ: సత్తెనపల్లి– నరసరావుపేట ప్రధాన రహదారి వెంబడి వ్యర్థాల తొలగింపు చర్యలను పంచాయతీ సిబ్బంది చేపట్టారు. 'సంపద సృష్టి చెత్తే' శీర్షికన సాక్షి దినపత్రికలో ఆదివారం వచ్చిన కథనంపై పంచాయతీ సిబ్బంది స్పందించారు. అందులో భాగంగా ప్రధాన రహదారి వెంబడి, శివాలయం వద్ద ఉన్న చెత్తను క్రేన్ సాయంతో రహదారికి దూరంగా నెట్టి వేసే పనులు చేపట్టారు. గ్రామంలో ప్రచారం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అలరించిన సంగీత గాత్ర కచేరి



అమరావతి: స్థానిక యోగాశ్రమంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాల రెండవరోజు ఆదివారం నిర్వహించిన సంగీత గాత్ర కచేరి సభికులను ఆకట్టుకుంది. సాయంత్రం ఆరు గంటలకు అనేక దేశాలు, దివ్య క్షేత్రాలలో కచేరి చేసిన ప్రయాగ అనసూయ అనేక వాగ్గేయకారుల కీర్తనలు, భక్తి గీతాలు ఆలపించి శ్రోతలను అలరించారు. ఈ కచేరిలో ధూళిపాళ శ్రీనివాసశాస్త్రి వయోలిన్, జగన్మోహిని మృదంగ సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ధాన్యకటక బుద్ధ విహార ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావుతో పాటు పుర ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

క్రోసూరు: సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు, విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్ ఆదివారం తెలిపారు. మండలంలో 14,642 మంది చిన్నారులకు, విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు అందజేయనున్నట్లు చెప్పారు. నులిపురుగుల నివారణ కొరకు వేసే ఆల్‌బెండజోల్ మాత్రలు 1–2 సంవత్సరాల చిన్నారులకు అరమాత్ర, 2–19 వయస్సు విద్యార్థులకు పూర్తి మాత్ర వేయటం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులు 3054, అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో, కాలేజీల్లో 11,588 మంది విద్యార్థులకు మొత్తం 14,642 మందికి మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. మాత్రలు వేసుకోకుండా మిగిలిన పోయిన విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన వేయటం జరుగుతుందని తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: గుట్టుచప్పుడు కాకుండా సుబాబుల్ తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గణపవరం రెవెన్యూ పరిధిలోని కుప్పగంజివాగు సమీపంలో సుబాబుల్ తోటలో పేకాడుతున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

నాదెండ్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు వేధిస్తూ హింసిస్తున్నారని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన శ్రీమాధురిచౌదరికి హైదరాబాద్‌కు చెందిన కృష్ణకిరణ్‌తో 2019 ఫిబ్రవరిలో వివాహమైంది. అప్పటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలంటూ తనను వేధిస్తున్నారంటూ భర్త కృష్ణకిరణ్, అత్తామామలు శశిప్రసాద్, పద్మజారాణి, తాత మల్లికార్జునరావులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఖాదర్‌బాబా ఉత్సవాలు

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని మార్కాపురం రోడ్డు పసుపులేరు బ్రిడ్జి కోల్డ్ స్టోరేజ్ వద్ద ఖాదర్ బాబా ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ఖాదర్ బాబా జెండా వద్ద బాబా విగ్రహానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కొప్పురావూరి బాబా వరప్రసాదరావు, కాసుల గురునాథం, దోసపాటి బాబు, బండి వెంకటేశ్వర్లు, సుభాని మాస్టర్ (రవీంద్రస్కూల్), మేడం అశోక్, వి. మంగారావు, గంగిశెట్టి జగదీష్‌బాబు, కాకుమాను రామారావు, చీమకుర్తి రత్నాకర్, బాబా కోటేశ్వరరావు, గర్రె నరసింహారావు, గుంటకల నాగేశ్వరరావు, బద్రీనాథ్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఫలించిన పోరాటం.. ఆనందంలో రైతులు

- ఫారెస్ట్, రెవెన్యూ శాఖల జాయింట్ సర్వేలో తేటతెల్లం
- సకాలంలో స్పందించిన తహసీల్దారు



నిరుపేదలకు ఇచ్చిన భూమి

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని తాళ్లచెరువు, చెరుకుంపాలెం గ్రామాల లో సుమారు 100 మందికి పైగా ఎస్సీ, బీసీ నిరుపేద కుటుంబాలకు సర్వే నెం. 320 నుంచి 337 వరకు ఉన్న భూమిని 1993లో పంపిణీ చేసి డీకే పట్టాలు ఇచ్చారు. ఆ భూములు అడవుల పక్కనే ఉండటంతో అవి ఫారెస్ట్ కిందకు వస్తాయన్న అనుమానంతో అప్పుడున్న ఉమ్మడి గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టరు, జిల్లా అటవీ శాఖాధికారులు జాయింట్ సర్వే చేసి అవి రెవెన్యూ భూములేనని నిర్ధారించి నిరుపేదలకు కేటాయించి డీకే పట్టాలు కూడా ఇచ్చారు. చాలా మంది లబ్ధిదారులు ఆ భూ ములను అభివృద్ధి చేసుకుని సాగు చేసుకుంటున్నారు.

+ ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అటవీ శాఖాధికారులు మళ్లీ ఆ భూములు ఫారెస్ట్ కిందకు వస్తాయంటూ రైతులపై కేసులు బనాయించి, పొలాల్లోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంతో రైతులు ఆందోళనకు గురై రైతు సంఘాలను ఆశ్రయించారు. తమకు 30 సంవత్సరాల క్రితం రెవెన్యూ భూములుగా నిర్ధారించి ఇచ్చిన భూములు.. మరలా ఫారెస్ట్ భూములు ఎలా అవుతాయంటూ రైతులు ఆందోళనకు దిగారు. ఇటీవల చెరుకుంపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఈ విషయాన్ని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

రైతు సంఘాల ద్వారా పోరాటం

ఇది ఇలా ఉండగా భూములను సాగు చేసుకుంటున్న రైతుల పక్షాన న్యాయం జరిపించేందుకు రాష్ట్ర, జిల్లా రైతు సంఘాల ప్రతినిధులు వచ్చి భూములను పరిశీలించి, రైతుల పక్షాన నిలబడ్డారు. రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామంటూ హెచ్చరికలు జారీ చేశారు. మరికొంత మంది రైతులు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

స్పందించిన తహసీల్దారు

దీనిపై వెంటనే స్పందించిన స్థానిక తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీ శాఖాధికారులతో తిరిగి జాయింట్ సర్వే చేపట్టారు. రెండు రోజులపాటు ఎఫ్ఎంబీ మ్యాపులు, శాటిలైట్ పిక్చర్స్, జీపీఎస్ వంటి సాంకేతికతను ఉపయోగించి సర్వే చేశారు. సర్వేలో అవి రెవెన్యూ భూములుగా రూఢీ అయ్యింది. అయితే అప్పటి రెవెన్యూ అధికారులు నిరుపేదలకు భూములైతే ఇచ్చారు గానీ వాటికి హద్దులు నిర్ణయించలేదు. లబ్ధిదారులు సర్వే కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా లేదా గ్రామంలో నిర్వహించే రీసర్వే పథకం ద్వారా హద్దులు నిర్ణయించడం జరుగుతుందని తహసీల్దారు స్పష్టం చేశారు.

ఆన్‌లైన్ చేయలేదు

నాకు 1993లో 1.25 ఎకరాల భూమి ఇచ్చి, డీకే పట్టా కూడా ఇచ్చారు. అయితే ఆ భూమిని ఆన్‌లైన్ చేయలేదు. ఆన్‌లైన్ చేసి పాసు పుస్తకాలు ఇస్తే బ్యాంకుల ద్వారా పంటలకు రుణాలు తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. తహసీల్దారు స్పందించడం వల్లనే మా భూములు మాకు దక్కాయి.

– కె.చిన నరసింహారావు, రైతు, చెరుకుంపాలెం

మా భూమి మాకు దక్కింది



1993లో నా భర్త కె.కోటిరెడ్డి పేరుపై ఎకరం భూమి ఇచ్చారు. దాన్ని కష్టపడి సాగుకు అనుకూలంగా అభివృద్ధి చేసుకున్నాం. ఒకసారి జాయింట్ సర్వేలో రెవెన్యూ భూమి అని తేలిన తరువాత మళ్లీ అటవీ భూములు అని ఎందుకు అంటున్నారో అర్థం కావడం లేదు. ఈ భూమే మాకు జీవనాధారం. తహసీల్దారు సకాలంలో స్పందించడం వల్లనే మా భూమి మాకు దక్కింది.

– కత్తుల నాగసంధ్య, మహిళా రైతు, చెరుకుంపాలెం

హద్దులు నిర్ణయించండి



నాకు 1993లో అప్పటి ప్రభుత్వం 90 సెంట్ల భూమిని ఇచ్చింది. అయితే దానికి హద్దులు నిర్ణయించలేదు. ఏదో ఊహాజనితంగా సాగు చేసుకుంటున్నాను. రెవెన్యూ వాళ్లు స్పందించి వెంటనే నాకు ఇచ్చిన భూమికి హద్దులు నిర్ణయించినట్లయితే నా పరిధిలో నేను సేద్యం చేసుకునే అవకాశం ఉంటుంది.

– నుంకర భానురావు, రైతు, చెరుకుంపాలెం

సాగుదారులకు దక్కేలా..



తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలో సర్వే నెం.320 నుంచి 337 వరకు వంద ఎకరాలకు పైగా భూమి ఉంది. ఈ భూమిని 1993లో తాళ్లచెరువులో ఎస్సీలకు, చెరుకుంపాలెంలో బీసీలకు ఇవ్వడం జరిగింది. చాలా మంది సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు అటవీ శాఖాధికారులతో కొద్దిపాటి అంతరాయం కలగడంతో జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి, మళ్లీ జాయింట్ సర్వే చేసి సాగు చేసుకుంటున్న వారికి భూములు దక్కేలే నా బాధ్యతను నేను నిర్వహించా.

– జి.శ్రీనివాసయాదవ్, తహసీల్దారు, అచ్చంపేట

వైభవంగా నందికుంట విఘ్నేశ్వరుని గుడి వార్షికోత్సవం



దేవాలయం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాట ప్రదర్శన



ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులోని చారిత్రాత్మక నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ముందుగా స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి మండపారాధన నిర్వహించారు. నవగ్రహ పూజలు నిర్వహించి లక్ష్మీగణపతి హోమం, మహన్యాసకపూర్వక రుద్రాభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలూ కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సుమారు రెండు శతాబ్దాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు ఆలయానికి ఎడ్లబండ్లతో తరలివచ్చి పూజలు నిర్వహించి ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ప్రభలు తరలించి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పిస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయని రైతులకు ప్రగాఢ విశ్వాసం. కుటుంబంలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రారంభిస్తారు. వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకూ ఒంగోలు జాతి వృషభరాజాల బలప్రదర్శన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సత్తెనపల్లికి చెందిన ముక్కపాడు బ్రహ్మం ఆధ్వర్యంలో నాదెండ్ల, పొనుగుపాడు, కండ్లగుంట, చాగంటివారిపాలెం, లింగారావుపాలెం గ్రామాలకు చెందిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

ప్రణాళికతో సిద్ధమైతే ఎన్‌సీసీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు



అవగాహన సదస్సుకు హాజరైన గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖరరావు తదితరులు

నరసరావుపేట రూరల్: ప్రణాళికతో సిద్ధం కావడం ద్వారా ఎన్‌సీసీ బీ,సీ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం.చంద్రశేఖరరావు తెలిపారు. ఈనెలలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు నిర్వహించనున్న బీ, సీ సర్టిఫికేట్ పరీక్షల కోసం సిద్ధమయ్యే క్యాడెట్స్‌కు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కల్నల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమయపాలనతో, రోజు వారి అభ్యాసన వల్ల పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వివరించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, నాయకత్వ లక్షణాలు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, జనరల్ అవేర్నెస్, హెల్త్ అండ్ హైజిన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్‌కు పట్టణ పరిధిలోని పలు కళాశాలల నుంచి 250 మంది క్యాడెట్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఆఫీసర్ మేడికొండ రాజేష్ బాబు, ఇతర కళాశాలల ఎన్‌సీసీ అధికారులు మేజర్ బీఎస్ఆర్‌కే రాజు, వై.అంజిరెడ్డి, 23వ ఆంధ్రప్రదేశ్ బెటాలియన్ సుబేధార్ ముకేష్‌కుమార్, హవల్దార్ దీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యం ఎంతో ముఖ్యం

మాచర్ల: ప్రతి మనిషి ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఆరోగ్యంగా ఉండాలని, జీవిత ప్రమాణాన్ని పెంచుకోవాలని హైదరాబాద్‌కు చెందిన యశోద హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు కిషన్, పుష్పారెడ్డి, కృష్ణా జనరల్ హాస్పిటల్ గుర్రం రాజశేఖర్ అన్నారు. ఆదివారం సాగర్ రోడ్డులోని వైభవ్ రెసిడెన్సీలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ గ్రామీణ ప్రాంత వైద్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వైద్యుల సేవలు అభినందనీయమన్నారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వివిధ ప్రాంతాలకు తరలించి గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాలను కాపాడుతున్న వైద్యుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. మాచర్ల డివిజన్, ఆర్ఎంపీ, పీఎంపీ, వైద్యుల గౌరవాధ్యక్షుడు రాజ్ సిద్ధార్థ, వైద్యులు రామారావు, నాగేశ్వరరావు, సిద్దయ్యచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మందికి అవగాహన కల్పించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస రాజు, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన గురజాల

గురజాల : పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న యేచూరి వారి బజారులో మాదాల శ్రీనివాసరావు సతీమణి కుమారి ఆధ్వర్యంలో వివిధ మాలదారులు భజనా కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్టేజీపై శివ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, పూజలు నిర్వహించారు. స్వామి వారికి 18 రకాల అభిషేకాలతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు సుధాకర్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులలో మందు సీసాలపై ప్రత్యేక ముద్ర



మద్యం సీసాలపై ప్రత్యేకంగా వేస్తున్న స్టిక్కర్లు

అమరావతి: మండల పరిధిలో ఇష్టారాజ్యంగా బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. మండలంలో సుమారు 54 బెల్ట్ షాపులు మద్యం దుకాణాల నుంచి గుర్తింపు పొందినవి ఉండగా గుర్తింపు లేకుండా నేరుగా షాపులో కొని అధిక రేటుకు అమ్మే షాపులు సుమారు 32 దాకా ఉన్నాయి. మద్యం దుకాణాల నుంచి గుర్తింపు పొంది గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహించే వారు సుమారు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు డిపాజిట్‌లు కట్టి వారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఒక్కో బాటిల్‌కు రూ.20 అధికంగా చెల్లించి తీసుకుపోయి వాటిని రూ.50 అధిక ధరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఇక బెల్ట్ షాపులకు అమ్మిన మద్యం బాటిళ్ల మూత మీద ప్రత్యేకంగా తయారు చేసిన ముద్ర కలిగిన స్టిక్కర్లు అంటించి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తుంది. మద్యం షాపుల నిర్వాహకులు బెల్ట్ షాపులను పరిశీలించినపుడు స్టిక్కర్లు లేని బాటిళ్లు అమ్మితే వెంటనే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసి కేసులు పెట్టిస్తారని బెల్టు షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్సైజ్ అధికారులకు ఈ నిర్వాకం అంతా తెలియకుండా జరుగుతుందా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెల్టు షాపులలో అధిక రేట్లకు మద్యం విక్రయాలతో మేము నష్టపోతున్నామని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బృగుబండ గ్రామంలో గోవర్ధనమ్మకు నివాళి



గోవర్ధనమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామ సర్పంచ్ గండు పద్మావతిసాంబశివరావు నాయనమ్మ గండు గోవర్ధనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం గోవర్ధనమ్మ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, రైతు సలహా మండలి రాష్ట్ర మాజీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా నిత్య సహాయ మాత ఆలయ వార్షికోత్సవాలు



నిత్య సహాయ మాత దేవాలయంలో పూజలు

మాచర్ల: పట్టణంలోని రింగురోడ్డు ప్రాంతంలో ఆర్‌సీఎం దేవాలయంలో నిత్య సహాయ మాత దేవాలయ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్‌సీఎం చర్చి పాస్టర్, విచారణ గురువులు కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణ నిర్వహించారు. పలువురు క్రైస్తవ భక్తులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ వరకు చర్చిలో నిత్య సహాయ మాత వేడుకలను నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ప్రత్యేక ప్రార్థన జరుపుతారు. అందులో భాగంగా ఆదివారం పాస్టర్ రఫేల్ రెడ్డితో పాటు, పెద్దలు ఎస్.సుందరరావు, జి.కిరీటి రెడ్డి, జె.మర్రెడ్డి, ప్రేమ్ కుమార్, గాంధీ, సిస్టర్లు తామాసమ్మ, సుజాత, ఇన్నమ్మ, ఇన్నారెడ్డి ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం చర్చి ప్రాంగణంలో క్రైస్తవ భక్తులకు ప్రత్యేక ప్రార్థనలనంతరం విందు నిర్వహించారు.

ధాన్యం నిల్వకు రైతుల విముఖత

- క్రోసూరు, అచ్చంపేట మండలాల్లో కొద్ది మంది మాత్రమే వినియోగం
- ఖర్చులు చూసి భయపడుతున్న రైతన్నలు
- అధిక శాతం కల్లాల్లోనే ధాన్యం విక్రయాలు



క్రోసూరు మార్కెట్‌యార్డులో గోడౌన్లు

క్రోసూరు: రైతు ప్రయోజనం, శ్రేయస్సు కొరకు పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి, పెదకూరపాడు, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల మార్కెట్ యార్డుల్లో ధాన్యం, పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోడౌన్లు నిర్మించినప్పటికీ అనేక కారణాల వల్ల రైతులు నిల్వ చేసుకోవటం లేదు. గోడౌన్లు ఉన్నప్పటికీ రైతులు వివిధ కారణాలతో విముఖత వ్యక్తం చేస్తున్నారు. 2005లో అప్పటి క్రోసూరు మార్కెట్‌యార్డులో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మూడు పెద్ద గోడౌన్లను నిర్మించటం జరిగింది. వాటిలో ఒక దానిలో మాత్రమే ప్రస్తుతం ధాన్యం నిల్వ చేసుకుంటుండగా మిగతా రెండింటిలో ఒకటి పౌరసరఫరాల శాఖ పంపిణీ చేసే బియ్యం నిల్వ చేసుకునేందుకు, మరొకటి జిల్లా ఎరువుల విక్రయ కేంద్రం (జీడీసీసీ)కి వినియోగిస్తున్నారు.

చెల్లించాల్సిన యార్డు రుసుము ఇలా..

సాధారణంగా రైతులు మార్కెట్‌యార్డులో ధాన్యం 100 బస్తాలు నిల్వ చేసుకుంటే ఏడాదికి అద్దె రూ.800, బీమా రూ.400 చెల్లించాలి. బస్తాకు రూపాయి చొప్పున వాటిపై పురుగులు పట్టకుండా ఉండేందుకు (ఎన్నాళ్లు పెట్టుకున్నా) కొట్టే మందుకు చెల్లించాలి. అంటే 100 బస్తాలైతే రూ.100 చెల్లించాలి. అంటే మొత్తం 100 బస్తాలకు రైతు చెల్లించాల్సింది రూ.1,300 మాత్రమే. ఆ తరువాత నిల్వ ధాన్యం రైతు ఎవరికైనా విక్రయించినా, తానే స్వయంగా తీసుకెళ్లినా ఎమ్మెస్పీ ధరపై నిల్వ చేసిన ధాన్యం విలువపై 2 శాతం సెస్సు యార్డుకు చెల్లించాలి. ధాన్యం నిల్వ చేసుకున్న రైతుకు అవసరమైతే విలువపై 70 శాతం రుణ సౌకర్యాన్ని మార్కెట్ యార్డు కల్పిస్తుంది.

ధర లేదు.. ఖర్చులు పెరిగాయి



ధాన్యానికి ధర ఉండక పోవటం, పెట్టుబడి ఖర్చులు పెరగటం, గన్నీ రూ.60 పెట్టి కొనుగోలు చేయటంతో రైతులు నిల్వ చేసుకునే పరిస్థితులు ఉండటం లేదు. పైగా నిల్వ చేసుకుంటే ధర పెరుగుతుందో.. లేదో చెప్పలేని పరిస్థితి. యార్డులో ధాన్యం పెద్ద రైతులు, లేదా రైతుల పేర్లమీద వ్యాపారస్తులు మాత్రమే పెట్టుకోగలరు.

– రాంపిచర్ల వరప్రసాద్, రైతు, క్రోసూరు

7,000 ఎకరాల్లో వరి సాగు

ఐదు మండలాల్లో సుమారు 7,000 ఎకరాల్లో వరి సాగు జరుగుతున్నప్పటికీ, రైతులు అధిక శాతం ఎప్పటికప్పుడు విక్రయించుకోవటం లేదా, ఇళ్ల వద్దే నిల్వ చేసుకోవటం జరుగుతుంది కానీ మార్కెట్‌యార్డు గోడౌన్లలో నిల్వ చేసుకోవటం లేదు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో మొత్తం 4 మెట్రిక్ టన్నులు మాత్రమే భర్తీ అయినట్లు, రైతులు యార్డు గోడౌన్లు సద్వినియోగం చేసుకోవాలని యార్డు సెక్రటరీ ఈశ్వరరావు కోరారు.

సేవా పురస్కారాలు అందజేత

చిలకలూరిపేట: సేవా కార్యక్రమాలు చేసేవారిని గుర్తించి పురస్కారాలు అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు.పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ హాలులో జయజయసాయి ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురికి సాయిసేవా భగవాన్ సేవా పురస్కారాలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జయజయసాయి ట్రస్టు ఆధ్వర్యంలో పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టు అధ్యక్షుడు పూసపాటి బాలాజీ సేవలను కొనియాడారు.ట్రస్టు అధ్యక్షుడు పూసపాటి బాలాజీ మాట్లాడుతూ కరోనా సమయం నుంచి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షిరిడి సాయి నిత్యాన్నదాన సత్రం నిర్వాహకుడు మద్ది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫైనల్ పరీక్షలకు రంగం సిద్ధం



తరగతి గదిలో పాఠాలు బోధించుతున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత శాతం వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి ఇంటరు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతాయి. ఇందులో భాగంగా ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తి కావటంతో ఫలితాల ఆధారంగా విద్యార్థినులను గ్రేడులుగా విభజించి మంచి ఫలితాల సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటరు మొదటి సంవత్సరం 37 మంది, ఇంటరు ద్వితీయ–32 మంది బాలికలు మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఫైనల్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరికి ఉదయం, సాయంత్రం వేళల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాల ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు మాట్లాడుతూ సబ్జెక్టుల రివిజన్‌తోపాటు పరీక్ష సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలు, దస్తూరీపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.

ప్రజావేదికకు అధికారులందరూ హాజరుకావాలి

నకరికల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కె.పుల్లారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. నిర్ణీత సమయానికి కార్యక్రమం ప్రారంభించి ప్రజలకు సహకరించాలని కోరారు.

సత్యసాయి శత జయంతి వేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా కమిటీ సభ్యులు

కారెంపూడి: సత్య సాయిబాబా శత జయంతిని స్థానిక సత్య సాయి సేవాసదన్‌లో ఆదివారం నిర్వహించారు. సత్యసాయి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల అభ్యున్నతికి సమాజం సవ్య దిశలో పయనించడానికి ఆయన చేసిన ఉపదేశాలు అపూర్వమని సేవా సదన్ నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం కారెంపూడి తండాకు వారు తరలివెళ్లి అక్కడ వంద మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా కమిటీ, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు సత్యసాయి భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.